క్లుప్తంగా

సోషల్ మీడియాలో మంత్రిని దూషించిన వ్యక్తిపై ఫిర్యాదు

గుంటూరు ఈస్ట్: మంత్రి రోజాను తీవ్ర పదజాలంతో సోషల్ మీడియాలో దూషించిన వ్యక్తిపై వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు ఝాన్సీ రాణి ఆదివారం అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో రామానాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఝాన్సీరాణి మాట్లాడుతూ సురేంద్ర కుమార్ అనే వ్యక్తి ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో మంత్రి రోజాను తీవ్ర పదజాలంతో దూషించాడని తెలిపారు. అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశానని చెప్పారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికగా జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సంస్కార భారతి అధ్యక్షుడు ఇండ్ల శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. విద్యార్థుల వందేమాతరం ప్రార్థన గీతంతో పోటీల్ని ప్రారంభించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు భారతమాత చిత్రానికి రంగులు వేయడం, వేమన పద్యాలు, ఏకపాత్రాభినయం పోటీల్ని నిర్వహించారు. నగరంలోని పలు పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.

ఐక్యతతోనే ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం



పొన్నూరు: ఉపాధ్యాయులు ఐక్యంగా ఉండి సమస్యల్ని పరిష్కరించుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కె. జోజయ్య తెలిపారు. పట్టణంలోని కల్యాణ మండపంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ గుంటూరు జిల్లా నూతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కార్యాలయంలో యూటీఎఫ్ పతాక ఆవిష్కరణ అనంతరం పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జోజయ్య మాట్లాడుతూ 50 ఏళ్ల యూటీఎఫ్ ప్రయాణంలో అనేక హక్కులు సాధించినట్లు చెప్పారు. ఎస్టీఎఫ్ఐ రాష్ట్ర సహాయ అధ్యక్షురాలు ఎ.ఎస్. కుసుమకుమారి, సీనియర్ నాయకులు మోహన్‌రావు, రాష్ట్ర ప్రతినిధి కె.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి. ఆదిలక్ష్మి, ఎం. కళాధర్, జిల్లా గౌరవాధ్యక్షులు పి.వి. శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి డి. సాయికృష్ణ , కొండపల్లి నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన హాస్య వల్లరి



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలోని అన్నమయ్య కళా వేదికపై ఆదివారం సాయంత్రం గుంటూరు హ్యూమర్ క్లబ్ 111వ హాస్యవల్లరి సందడిగా సాగింది. ఆ పిలుపే నా కోరిక, దంత వేదాంతం, మూకాభినయం నాటికలు సభికుల్ని అలరించాయి. ముఖ్య అతిథిగా మలినేని లక్ష్మయ్య ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు, విశిష్ట అతిథులుగా డాక్టర్ వి.ఆంజనేయప్రసాద్, యార్లగడ్డ సుబ్బయ్య, లింగ పున్నయ్య, డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు, దేవాలయ కమిటీ అధ్యక్షుడు లంకా విజయబాబు పాల్గొన్నారు. సభాధ్యక్షులుగా ఆచార్య జె.కిశోర్‌బాబు వ్యవహరించారు. క్లబ్ వ్యవస్థాపక కార్యదర్శి షేక్ లాల్‌వజీర్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ

నగరంపాలెం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్యకరంగా ఉండవచ్చని, అంటువ్యాధులు కూడా వ్యాపించవని 18వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ తెలిపారు. రోజు వారీ పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన ఆర్.అగ్రహారం, ఏడుగొందుల సందు, పట్నంబజార్, వెలగచెట్టువారి వీధి, ఎత్తు రోడ్డు ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లోని స్థానికులతో మాట్లాడారు. మంచినీరు నిర్ణీత వేళల్లో సరఫరా అవుతోంది.. లేనిది ? అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతలో స్థానికులు సైతం భాగస్వామ్యం కావాలని సూచించారు. తడి, పొడి చెత్తను ఎక్కడపడితే అక్కడ పడేయద్దని, ఇంటింకి వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని చెప్పారు.

టీడీపీ అసత్య ప్రచారాలు సిగ్గుచేటు

ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజార్: నగరం అభివృద్ధి పథంలో నడుస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక రాజకీయాలు చేయడం సిగ్గుచేటని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మహ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా మండిపడ్డారు. ఆదివారం తొమ్మిదో డివిజన్ పరిధిలోని నందివెలుగు రోడ్డు, పాత గుంటూరు ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్ల మరమ్మతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా, నూరి ఫాతిమా మాట్లాడుతూ ఎల్లో మీడియా ద్వారా టీడీపీ నేతలు తప్పుడు కథనాలను ప్రచురించి ప్రజల్ని ఏమార్చే ప్రయత్నం చేయడం సబబు కాదని తెలిపారు. పూర్తిస్థాయిలో తూర్పు నియోజకవర్గంలో మరమ్మతు పనులతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నా అభూత కల్పనలు చేయడం సిగ్గుచేటని ఖండించారు. గత ప్రభుత్వంలో నియోజకవర్గంలో టీడీపీ నేతలు చేసిన అభివృద్ధి శూన్యమని, దీనిపై టీడీపీ ఇన్‌చార్జి సమాధానం చెప్పగలరా ? అని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాకా అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో సైతం ఆయన్ను ముఖ్యమంత్రి చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తొమ్మిదో డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఆర్.భాస్కర్ పాల్గొన్నారు.



రోడ్లకు మరమ్మతులు చేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

అవోపా ఆధ్వర్యంలో పేదలకు పింఛన్ల పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) కార్యాలయంలో పేదలు, వృద్ధులకు నెలవారీ పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ మాట్లాడుతూ 108 మంది పేదలకు రూ.500 చొప్పున పింఛన్‌తో పాటు శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు మాట్లాడుతూ ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉచితంగా శిక్షణ కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అవోపా జిల్లా అధ్యక్షుడు కె.వి. బ్రహ్మం, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, చామర్తి రమేష్, సుధాకర్ పాల్గొన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న నరేంద్ర, అవోపా ప్రతినిధులు

నేడు నగరపాలక సంస్థలో ‘స్పందన’

నెహ్రూనగర్: ప్రజల నుంచి స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయాల్లోనూ ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని, అక్కడ స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై తమకు నేరుగా అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

23న రాజ్యాంగ ఆమోదిత దినోత్సవం



నెహ్రూనగర్: అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని నవంబర్ 26న భారత పార్లమెంటు ఆమోదించిన సందర్భంగా ఈనెల 23న ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న అంబేడ్కర్ భవన్‌లో రాజ్యాంగ ఆమోదిత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ నాయకులు, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక కమిటీ నాయకులు, ఐడియా ఇద్వా సంఘాల నాయకులు తెలిపారు. సదస్సులో ప్రధాన వక్తలుగా శాసనమండలి సభ్యులు, జిల్లా అధికారులు, ప్రొఫెసర్లు పాల్గొంటారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సమస్యలపై పలు తీర్మానాలను ప్రవేశపెట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పంపుతామని చెప్పారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత మొదటిసారిగా రాష్ట్రంలో కుల గణన నవంబర్ 26 నుంచి ప్రారంభం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. కుల గణన అనంతరం, దామాషా ప్రాతిపదికన రాజ్యాంగ ఫలాల్ని సాధించేందుకు జరగాల్సిన కృషిపై కూడా సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం, క్రైస్తవ మైనారిటీ ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులంతా పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మద్దు ప్రేమ జ్యోతి బాబు, కందుల దినమ నరాజు, డొక్కా జార్జ్, తిప్పా బత్తుని గోవిందు, మోపర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థుల మానసిక వికాసానికి క్విజ్ పోటీలు దోహదం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల మానసిక వికాసానికి క్విజ్ పోటీలు దోహదం చేస్తాయని భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షుడు టి.ఎస్. రాజశేఖర్ తెలిపారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో ఆదివారం భారత్ వికాస్ పరిషత్-అమరావతి ప్రాంత్ ఆధ్వర్యంలో భారత్ కో జానో పేరుతో రాష్ట్ర స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీహెచ్.ఎ.పి. రామేశ్వరరావు మాట్లాడుతూ క్విజ్ పోటీల్లో పాల్గొనడం ద్వారా మానసిక వికాసంతో పాటు పోటీ ప్రపంచంలో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌తో కూడుకున్న సమాచారం ఎంతో ఉపయోగ పడుతుందని చెప్పారు. క్విజ్ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. జూనియర్స్ విభాగంలో గుంటూరు కొండవీడు పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు అఖిల, అన్నావైష్ణవి ప్రథమ స్థానం, విజయవాడలోని ఫ్యూచర్‌పాత్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఏ. హర్షవర్ధన్, కె. కీర్తన, ద్వితీయ స్థానం, మచిలీపట్నంలోని నిర్మలా హైస్కూల్ విద్యార్థులు వి.కె.ఎన్. అయ్యప్ప, బి. కేతనాశ్య తృతీయ స్థానంలో నిలిచారు. సీనియర్స్ విభాగంలో మంగళగిరిలోని అరవిందా స్కూల్ విద్యార్థులు వై. సత్య సుబ్రహ్మణ్య, జి. ప్రమోద్, గుంటూరులోని కొండవీడు పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఏ.శ్రీవత్స, ఏ.హర్షవర్ధన్, గుడివాడలోని సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు కె. మహిత, టీవీడీ మానస తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈనెల 26న వైజాగ్‌లో జరిగే రీజినల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు కళాశాల కరస్పాండెంట్ కె.వి. బ్రహ్మం సమక్షంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్.వి.ఎస్ లక్ష్మీనారాయణ, సాదు శివశంకరరావు, మల్లికార్జునరావు, సీహెచ్. చలమయ్య, సీహెచ్. వసంతరావు, శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు

రైల్వే స్టేషన్‌లో బాలల వారోత్సవాలు

లక్ష్మీపురం: రైల్వేస్టేషన్లలో ఒంటరిగా ప్రయాణించే బాలలు, దారి తప్పిన బాలలకు అవగాహన కల్పించి వారి సంరక్షణ కోసం రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్ అందుబాటులో ఉంటాయని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ సమీర్, ఆర్పీఎఫ్ సీఐ రవీంద్రనాథ్ తెలిపారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో ఆదివారం బాలల వారోత్సవాల్ని రైల్వే చైల్డ్ హెల్ప్‌లైన్, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టేషన్లలో ఒంటరిగా సంచరిస్తున్న వారు, దారి తప్పిన బాలలు, తల్లిదండ్రులపై అలిగి వచ్చిన వారిని గుర్తించి టోల్‌ఫ్రీ నంబర్ 1098కు సమాచారం అందించాల్సిందిగా కోరారు. అనంతరం బాలల భద్రతపై పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ భాజన్, జీఆర్పీ ఎస్ఐ జి.వెంకటటాద్రి, ఆర్పీఎఫ్ ఎస్ఐ వనిత, రైల్వే చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్లు, సంస్థ సభ్యులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ సభ్యులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

ఆరుగురు జూదరులపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: పేకాట ఆడుతున్న ఆరుగురిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారం 4వ లైనులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.17,500 స్వాధీనం చేసుకున్నారు.

ఉత్సాహంగా ఆక్స్‌ఫర్డ్ కిడ్డీస్ ఫెస్టివల్

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన సినీ హీరో చేతన్

గుంటూరు ఎడ్యుకేషన్: చిన్నారుల్లో ఊహా శక్తి, సంగ్రహణ శక్తిని ప్రోత్సహించడం ద్వారా అన్ని విషయాల్లో చురుగ్గా ముందుకు వెళతారని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ స్మార్ట్‌కిడ్స్ పాఠశాల 25వ కిడ్డీస్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ చిన్నారులకు మనం ఎంత నేర్పిస్తే దానికి రెండింతలు నేర్చుకుంటారని చెప్పారు. సంస్కారంతో కూడిన విద్యతో పాటు శారీరక వ్యాయామం అవసరమని తెలిపారు.

ఈ సందర్భంగా సినీ హీరో చేతన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సినీ దర్శకుడు మాదాసు మధు, గైనకాలజిస్ట్ ఎం. లావణ్య, ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్. ఫ్రాన్సిస్‌రెడ్డి, డైరెక్టర్లు ఎస్. ఆరోన్‌రెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, జోసఫ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనాబేగం, కిడ్స్ క్యాంపస్ ఇన్‌చార్జ్ పి. సరోజిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఫ్రాన్సిస్‌రెడ్డి, పక్కన హీరో చేతన్



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

ప్రత్తిపాడు నియోజకవర్గ కన్వీనర్‌గా రవి దేవరాజ్



గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన బీజేపీ నేత కన్నా రవిదేవరాజ్‌ను ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కన్నా రవి దేవరాజు మాట్లాడుతూ ప్రత్తిపాడు అసెంబ్లీలో బీజేపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

24 నుంచి ‘వై ఏపీ నీడ్స్ జగన్’

గుంటూరు రూరల్: అర్బన్ మండల క్లస్టర్‌– 1లో ఈనెల 24 నుంచి డిసెంబర్ 14 వరకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాల్ని నిర్వహించనున్నట్లు కన్వీనర్ ఏటుకూరి విజయసారథి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 24న శ్రీనివాస కాలనీ, 28న నల్లపాడు– 1, 29న నల్లపాడు– 2, 30న గోరంట్ల, డిసెంబర్ 1న పొత్తూరు, 4న చౌడవరం– 1, 5న చౌడవరం– 2, 6న చౌడవరం– 3, 7న చౌడవరం –4, 8న చౌడవరం– 5, 11,12 తేదీల్లో ఏటుకూరు, 13న బొంతపాడు, 14,15 తేదీల్లో బుడంపాడు గ్రామాల్లో కార్యక్రమాల్ని నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామ సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో పుష్ప యాగం

పాత గుంటూరు: లాలాపేట శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తిక మాసం, స్వామి జన్మించిన శ్రవణా నక్షత్రం సందర్భంగా ఆదివారం అభిషేకం , తొమ్మిది రకాల పుష్పాలతో యాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ సూరినేడి దుర్గా వరప్రసాద్, ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ కార్యనిర్వహణాధికారి జొన్నకూటి సూర్యప్రకాశరావు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే షేక్ మహమ్మద్ ముస్తఫా, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా పాల్గొని, స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఆర్.టి.ఆర్.వి. ప్రసాద్, గోపాలకృష్ణ పుష్పయాగంతో పాటు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు ఉడత మహేష్ కుమార్, దమ్మాలపాటి విజయ నిర్మల, ఇస్లావత్ గాంధీ నాయక్, యంబడి రాంబాబు, సూరిబోయిన వెంకట్రావు, మైలవరపు సుజన, తరిమల్లె వనజ, జవ్వాజి లక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంపాలెంలో...

స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర దేవాలయ ఆవరణలోని అన్నమయ్య కళా వేదికపై స్వామివారి జన్మ శ్రవణ నక్షత్రం, కార్తిక మాసం సందర్భంగా ఆదివారం కొండబోలు శివప్రసాద్, ఉమాశంకర్ దంపతుల సౌజన్యంతో పుష్పయాగం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో అర్చకులు స్వామికి వేద మంత్రాలతో విశేష పూజలు జరిపారు. భక్తులకు మహా హారతి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మాధవస్వామి బృందం పూజలు నిర్వహించగా, పంచామృతాలు, వివిధ నదీ జలాలతో అభిషేకార్చన జరిపారు. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముస్తఫా, ఆలయ సభ్యులు



వెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన పుష్పయాగంలో పాల్గొన్న భక్తులు

జాతి నిర్మాతలు ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: భావితరాల భవిష్యత్తును నిర్మించే జాతి నిర్మాతలు ఉపాధ్యాయులని పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. ఆదివారం జేకేసీ కళాశాల రోడ్డులోని దాక్షిణ్య సంస్థలో ఇన్నర్ వీల్ క్లబ్, గుంటూరు వికాస్ ఆధ్వర్యంలో పాటిబండ్ల సీతారామయ్య పాఠశాలకు చెందిన ఉపాధ్యాయినులు మోహన వంశీ, నాగవల్లి సౌజన్య నేషనల్ బిల్డర్ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేయడం వారిలో మరింతగా ఉత్సాహాన్ని నింపుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, వైస్ ప్రిన్సిపాల్ తేజస్వి, ప్రైమరీ ప్రిన్సిపాల్ పార్వతీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పాటిబండ్ల విష్ణువర్ధన్

జీజీహెచ్‌లో వైద్యులు, సిబ్బంది శ్రమదానం

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లోని కమర్షియల్ క్యాంటీన్‌లో ఆదివారం డాక్టర్ కిరణ్ కుమార్, వైద్యులు, సిబ్బంది శ్రమదానం చేశారు. చీపురు పట్టి బూజు దులిపారు. పాత సామానులు, పనికిరాని వస్తువుల్ని తొలగించి శుభ్రం చేశారు. మూడు రోజుల్లో ఈ గదులన్నీ మెడికల్ విభాగానికి కేటాయించి 30 పడకల్ని అందుబాటులో ఉంచుతామని డాక్టర్ కిరణ్‌కుమార్ చెప్పారు. శ్రమదానం చేసిన వైద్యులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. పెద్ద మనస్సుతో గదుల్ని ఇచ్చేందుకు ముందుకు వచ్చిన క్యాంటీన్ నిర్వాహకుడు శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె. ఆశా సజని, సమీనా బేగం, ఇంజినీరింగ్ శాఖ అధికారులు రత్తయ్య, సత్యం, బయో మెడికల్ ఇంజినీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



అలరించిన ఘంటసాల స్వర నీరాజనం

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆవరణలో శ్రీ శుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘంటసాల స్వరనీరాజనం పేరుతో ఆదివారం నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకుల్ని విశేషంగా అలరించింది. కార్యక్రమాన్ని సంస్థ మహిళా కార్యదర్శి ధనలక్ష్మీకుమారి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 వరకు గాయకులు మేకల పురుషోత్తమప్రసాద్, పత్రి గాయత్రి, పావని, రజనీ యుగళ గీతాలు, సోలో గీతాలు 116కు పైగా ఆలపించారు. అనంతరం కళాసౌధ అధ్యక్షుడు బిల్లా అశోక్‌ను సత్కరించారు. కాపునాడు అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్, మిరియాల ప్రసాదరావు, కళాదర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు, వెంకాయమ్మ, డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, యర్రగోపు నాగేశ్వరరావు, దేవ సహాయం, ఆచారి, కళాకారుల సంఘం అధ్యక్షుడు వెంకటస్వామి పాల్గొన్నారు. వ్యాఖ్యాతలుగా దొప్పలపూడి శ్రీనివాసరావు, చీకటి రవికాంత్, పెల్లూరి కృష్ణారావు వ్యవహరించారు. కార్యక్రమాన్ని సంస్థ గౌరవాధ్యక్షుడు సిరిగిరి గణేష్, ఎన్నుబర్ల బ్రహ్మం, కమలికంటి వలి, తుమ్మేటి శ్రీనివాసరావు, శివయ్య నిర్వహించారు.



క్రికెట్ ఫీవర్



మాజేటి గురవయ్య క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ టీవీలో వరల్డ్ కప్ క్రికెట్ మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తూ, సందడి చేస్తున్న నగర ప్రజలు - సాక్షి ఫొటోగ్రాఫర్

కిడ్నీలపై షుగర్ వ్యాధి ప్రభావం తీవ్రం



గుంటూరు మెడికల్: ప్రపంచ మధుమేహ నిరోధక మాసం సందర్భంగా ఎస్‌హెచ్‌వో హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో భవనంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కిడ్నీల వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ కె .రఘురాం మాట్లాడుతూ కిడ్నీలపై షుగర్ వ్యాధి ప్రభావం అధికంగా ఉంటుందని తెలిపారు. అశ్రద్ధ చేస్తే డయాబెటిక్ నెఫ్రోపతికి గురయ్యే ప్రమాదముందని చెప్పారు. డాక్టర్ రఘురాం కిడ్నీ వ్యాధుల బాధితుల్ని పరీక్షించి, ఉచిత వైద్య సలహాలు అందజేశారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వైద్య శిబిరాల చైర్మన్ టి. ధనుంజయరెడ్డి, ఎస్‌హెచ్‌వో అధ్యక్షుడు డాక్టర్ తాతా సేవ కుమార్, మేనేజర్ పి. నిర్మలారాణి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, కార్యదర్శి సీహెచ్. సుబ్రహ్మణ్యం, సభ్యులు శివాజీ, సామ్రాజ్యం పాల్గొనారు.